కీసర పీహెచ్‌సీలో స్వచ్ఛభారత్



స్వచ్ఛభారత్‌లో పాల్గొన్న బీజేపీ నాయకులు

కీసర: సేవాపక్షం కార్యక్రమంలో భాగంగా మంగళవారం కీసర మండల బీజేపీ అధ్యక్షులు కోల బాలరాజుయాదవ్ ఆధ్వర్యంలో కీసర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ఆవరణలో ఉన్న చెత్తచెదారం, పిచ్చిమొక్కలు తొలగించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, నాయకులు బోడ శ్రీనివాస్‌రావు, అశోక్‌ముదిరాజ్, కృష్ణయాదవ్, ఐలయ్య యాదవ్, శ్రీశైలంయాదవ్, నగేష్ ముదిరాజ్, నాగరాజు ముదిరాజ్, శ్రీనివాస్, జంగయ్య, ఆంజనేయులు, పాపయ్య, మల్లారెడ్డి, మల్లేష్‌యాదవ్, ప్రభాకర్‌రెడ్డి, చంద్రమౌళికచారి, ఆంజనేయులు, శ్రీనివాస్, వేణుగోపాల్‌యావ్, లింగం, కృష్ణయాదవ్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో వాహన పూజలు



దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయంలో పూజలు చేస్తున్న దృశ్యం

కీసర: దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం వాహనపూజ, కార్యాలయ శాంతి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయానికి సంబంధించిన వాటర్ ట్యాంకులు, జేసీబీ, ట్రాక్టర్లకు, ఆటోలకు, జెట్టింగ్ మిషన్‌కు పూజలు చేశారు. అనంతరం పారిశుద్ధ్య సిబ్బందికి దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో డీఈఈ బాలమురళీ, మేనేజర్ వెంకటేశం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘం మాజీ ఎండీపై చర్యలు తీసుకోవాలి

ఘట్‌కేసర్: రైతు సేవా సహకార సంఘంలో అవినీతికి పాల్పడిన మాజీ ఎండీపై చర్యలు తీసుకోవాలని రైతు రుణమాఫీ సాధన సమితి సభ్యులు అన్నారు. ఈ మేరకు మంగళవారం కోఠి లోని రీజినల్ ఆఫీస్‌లో యూనియన్ బ్యాంకు డిప్యూటీ జనరల్ మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. రుణమాఫీ జాబితా తప్పుగా ఉన్నందుకే రుణ మాఫీ కాలేదని, తన అవినీతి బయట పడుతుందని రైతుల తుది జాబితాను ఎండీ పంపలేదని లేఖలో పేర్కొన్నారు. సంబంధిత అధికారులపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

రామలింగేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు



మేడ్చల్: పట్టణంలోని దాక్షాయణి సమేత రామలింగేశ్వర ఆలయంలో దసరా పండగ సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివుడికి అభిషేకాలు చేసి అర్చనలు నిర్వహించి అలంకరణ చేశారు.ఆలయంలో కొలువైన దాక్షాయని అమ్మవారికి నవరాత్రుల సందర్భంగా ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ధాత్రిక రాధాకృష్ణ, భక్తులు, వేద పండితులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చేనేత వస్త్ర ప్రదర్శన



ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో దసర ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసి ఎగ్జిబిషన్ సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. ముఖ్యంగా మంగళగిరి చీరలు, చేనేత వస్త్రాలు, బెడ్‌షీట్లు, పోచంపల్లి, గుజరాత్ బందీని, బీహార్ బగల్పూరీ, సో లాపూర్ హాండ్లూమ్ వస్త్రాలు ఆకట్టుకుంటున్నాయి.

అలరించిన చత్తీస్‌ఘడ్ జానపద నృత్యం

ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చత్తీస్‌ఘడ్ జానపద నృత్యం అహుతులను కట్టిపడేసింది. సౌత్‌జోన్ కల్చరల్ సెంటర్ సంయుక్తాధ్వర్యంలో నిర్వహించిన కామరానృత్యం, మధ్యప్రదేశ్ ప్రాంతానికి చెందిన గుడుంబాజా నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణలుగా నిలిచాయి.

ఆశ... నిరాశ

పురపాలికలుగా మారిన జీపీలు.. నిరాశలో ఆశావహులు

- ఇప్పట్లో మున్సిపల్ ఎన్నికలు జరిగే అవకాశం లేకపోవటంతో ఆశలపై నీళ్లు
- వీటిని కూడా జీహెచ్‌ఎంసీలో కలుపుతారని ప్రచారం
- స్థానిక ఎన్నికల నేపథ్యంలో సెమీ అర్బన్‌గా మారిన జీపీ నేతల్లో భిన్నాభిప్రాయాలు?



సాక్షి, మేడ్చల్ జిల్లా: సెమీ అర్బన్‌గా మారిన మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని పురపాలికలుగా మారిన గ్రామ పంచాయతీల్లోని రాజకీయ నిరుద్యోగ ఆశావహుల్లో నిరాశ నిస్పృహలు నెలకొన్నాయి. మేడ్చల్ జిల్లాలో ఐదు మండలాలు ,62 గ్రామ పంచాయతీలతో జిల్లా పరిషత్ (జెడ్పీ) కొనసాగేది. ఇటీవల కాంగ్రెస్ సర్కారు ఐదు మండలాల పరిధిలోని 62 గ్రామ పంచాయతీలను సమీప పురపాలికల్లో విలీనం చేసింది. ఓఆర్‌ఆర్ లోపలి ప్రాంతంలో ఉన్న 28 గ్రామ పంచాయతీలను సమీపంలోని ఏడు పురపాలక సంఘాల్లో విలీనం చేసినా ప్రభుత్వం .. మరో 34 గ్రామపంచాయతీలను కూడా మూడు పురపాలక సంఘాలుగా మార్చింది. దీంతో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా మొత్తంగా 16 పురపాలక సంఘాలతో అర్బన్,సెమీ అర్బన్‌గా మారింది. సోమవారం స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో జిల్లాలోని 62 గ్రామ పంచాయతీలు, ఐదు మండలాల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ,సర్పంచ్ ఎన్నికల ప్రస్తావన లేక పోవడంతో దాదాపు రెండేళ్లుగా స్థానిక ఎన్నికల కోసం ఎదురు చూస్తున్న రాజకీయ నేతల ఆశలపై నీళ్లు చల్లినట్లయ్యింది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని 62 గ్రామ పంచాయతీలు, ఐదు మండలాలు పురపాలక సంఘాలుగా మారటంతో వారిలో అందోళన నెలకొంది.

గతంలో రెండో అతి పెద్ద జిల్లాగా..

జిల్లాల పునర్విభజనలో భాగంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి కొత్తగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాగా ఏర్పడటంతోపాటు రాష్ట్రంలోనే హైదరాబాద్ తర్వాత అతి పెద్ద జనాభా కలిగిన రెండో జిల్లాగా అభివృద్ధి చెందింది. ఐదుగురు జెడ్పీటీసీలు, ఐదుగురు ఎంపీపీలు ,42 మంది ఎంపీటీసీలు ,62 మంది సర్పంచ్‌లతో కళకళలాడిన మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ప్రస్తుతం అర్బన్, సెమీ అర్బన్ ప్రాంతంగా మారింది. ఈ నేపథ్యంలో జిల్లా పరిషత్(జెడ్పీ)తో పాటు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ(డీఆర్డీఏ), ఆర్ డబ్ల్యూఎస్, జిల్లా పంచాయతీ శాఖలు కనుమరుగయ్యాయి. దీంతో ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న అభివృద్ధి పనులు కూడా నిలిచిపోయాయి.

16 పురపాలక సంఘాలుగా..

మేడ్చల్–మల్కాజిగిరి అర్బన్ జిల్లాలో జీహెచ్‌ఎంసీ పరిధిలోని మున్సిపల్ సర్కిళ్లను మినహాయిస్తే గ్రామ పంచాయతీలతో 16 పుర పాలక సంఘాలు ఏర్పడ్డాయి. వీటిలో నిజాంపేట, బోడుప్పల్, పీర్జాదిగూడ, జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్లు కాగా, మేడ్చల్, తూముకుంట. గుండ్లపోచంపల్లి, దమ్మాయిగూడ, నాగారం, పోచారం, ఘట్కేసర్, కొంపల్లి, దుండిగల్, కొత్తవి అలియాబాద్, ఎల్లంపేట, మూడుచింతలపల్లి మున్సిపాలిటీలుగా కొనసాగుతున్నాయి.

గ్రేటర్‌లో విలీనం చేస్తారని ఆందోళన..

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిధిలోని నిజాంపేట, జవహర్‌నగర్, బోడుప్పల్, పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్లతో పాటు పోచారం, ఘట్కేసర్, దమ్మాయిగూడ, దుండిగల్, మేడ్చల్, గుండ్లపోచంపల్లి, తూముకుంట, నాగారం, కొంపల్లి, అలియాబాద్,ఎల్లంపేట. మూడుచింతలపల్లి మున్సిపాలిటీలు కలుపుతారని జోరుగా చర్చ జరుగుతోంది. దీంతో మేయర్లు, చైర్మన్లు కూడా కార్పొరేటర్లు, కౌన్సిలర్లు అయ్యే అదృష్టం కూడా దక్కుతుందో..లేదోనన్న అందోళన స్థానిక పురపాలక సంఘాల్లోని పార్టీల నేతలను వేధిస్తోంది. రాజకీయ భవిష్యత్తుపై ఎన్నో ఆశలు పెట్టుకున్న నాయకులు తమ భవితవ్యం ఏమిటో అర్థం కాక అయోమయానికి లోనవుతున్నారు.

కలెక్టరేట్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు



సాక్షి,మేడ్చల్ జిల్లా: భాద్రపద మాస అమావాస్య రోజున ఎంగిలి పువ్వుతో ప్రారంభమైన బతుకమ్మ.. ఆశ్వయుజ మాస దుర్గాష్టమి రోజున సద్దుల బతుకమ్మగా మహిళలతో పూజలందుకుందని జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి వినోద్ కుమార్ అన్నారు. మంగళవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో వివిధ రకాల పూలతో బతుకమ్మను పేర్చి సంబరాలు జరుపుకున్నారు.చివరి రోజు కావటంతో బతుకమ్మ చుట్టూ చేరి ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో డీఆర్డీఓ పీడీ సాంబశివ రావు , జిల్లా ఎస్సీ వెల్ఫేర్ అధికారి వినోద్ కుమార్ , లీడ్ బ్యాంకు మేనేజర్ శివప్రసాద్ , డీఐఈవో కిషన్ , డివైఎస్‌ఓ వై . దామోదర్ రెడ్డి , గ్రౌండ్ వాటర్ అధికారి హరీష్ బాబు , డీపీఏహెచ్‌ఓ డాక్టర్ ప్రభురాజ్, కలెక్టరేట్ మహిళా అధికారులు ,ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు.

నాలా సమస్యపై హైడ్రా అధికారుల పరిశీలన

పోచారం: జోడిమెట్ల చౌరస్తాలో నెలకొన్న నాలా సమస్యను మంగళవారం హైడ్రా సీఐ సైదులు పరిశీలించారు. నాలా సమస్యను పరిష్కరించాలని మాజీ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు ఇటీవల హైడ్రా అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. అనంతరం సీఐ సైదులు మాట్లాడుతూ.. నాలాపై ఉన్న ఆక్రమణలను తొలగిస్తే వరద నీరు రోడ్డుపై నిలవకుండా సాఫీగా పోతుందన్నారు. కబ్జాలను తొలగించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఆకిటి కృష్ణారెడ్డి, గవ్వల రాములు, సామల బుచ్చిరెడ్డి, రవికుమార్, సామల నివాస్‌రెడ్డి, కూర రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నాలాను పరిశీలిస్తున్న హైడ్రా అధికారులు

ఓయో రూమ్స్ మూసివేతకు రంగం సిద్ధం



పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని సంస్కృతి టౌన్‌షిప్ సమీపంలో ఓయో రెస్ట్ రూమ్స్ భవనం మూసివేతకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. రెసిడెన్సియల్ ఏరియాలో పాఠశాలకు అతిసమీపంలో ఓయో రూమ్స్ ఏర్పాటు చేయడంపై భగత్ నగర్ కాలనీవాసులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఇటీవల ఫిర్యాదు చేయడంతో అధికారులు స్పందించారు. ఇందులో భాగంగా ఘట్‌కేసర్ మండల విద్యాధికారి శ్రీధర్‌రెడ్డి సోమవారం క్షేత్రస్థాయిలో పర్యటించి స్కూల్ ప్రిన్సిపాల్ కరీముల్లాతో పాటు కాలనీవాసులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం జిల్లా విద్యాధికారి, పోచారం మున్సిపల్ కమిషనర్‌కు నివేదికను అందజేశారు. తదుపరి చర్యల్లో భాగంగా పోచారం మున్సిపల్ కమిషనర్ నిత్యానంద్ ఆదేశాల మేరకు ఆర్ఐ కోట వెంకటేశ్వర్లు, బిల్ కలెక్టర్ మధు, సిబ్బంది మంగళవారం మధ్యాహ్నం ఓయో భవనాన్ని సీజ్ చేసేందుకు వచ్చారు. దీంతో నిర్వాహకులు మరో రోజు గడువు కావాలని కమిషనర్‌ను కోరడంతో బుధవారం సాయంత్రం నాలుగు గంటల్లోగా ఓయో ఏర్పాటుకు కావాల్సిన అన్ని అనుమతులు ఉన్నాయని నిరూపించుకునేందుకు అవకాశమిచ్చారు.

విద్యతోనే సమాజంలో మార్పు సాధ్యం



మాట్లాడుతున్న సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా ఇన్‌చార్జి అనురాధ

జవహర్‌నగర్: విద్యతోనే సామాజిక మార్పు సాధ్యమని పలువురు వక్తలు అన్నారు. 153వ సత్యశోధక్ సమాజ్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని నీలం రామచంద్రయ్యభవన్‌లో సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఇన్‌చార్జి అనురాధ, డివిజన్ కార్యదర్శి శివబాబు ఆధ్వర్యంలో మంగళవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యతోనే సమాజంలో మార్పు సాధ్యమన్నారు. మూఢ నమ్మకాలను పాలదోలి ఆధునికతవైపు ప్రజలను చైతన్యం చేయాలన్నారు. బీజేపీ మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. కుల దురహంకార హత్యలకు, కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడదామన్నారు. పూలే దంపతులు స్థాపించిన సత్యశోధక సమాజ్ స్ఫూర్తితో ప్రతి ఒక్కరు ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో శివప్రసాద్, యాదన్న, రాంరెడ్డి, మణెమ్మ, దులప్ప, యాదమ్మ, రాములు తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్‌కు అండగా ఉంటాం



కీసర: సీనియన్ సిటిజన్స్‌కు అండగా ఉంటూ వారికి అవసరమైన సేవలు అందిస్తామని కీసర సీఐ ఆంజనేయులు అన్నారు. మనకోసం శ్రమించిన వారి కోసం మన సంరక్షణ పేరిట రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు ఆదేశాల మేరకు సీఐ ఆంజనేయులు కీసరలోని సీనియర్ సిటీజన్స్‌ను కలిసి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగరాజు పాల్గొన్నారు.

వ్యక్తిపై ఇనుపరాడ్‌తో దాడి !

మేడిపల్లి: ఓ వ్యక్తిపై ఇనుపరాడ్‌తో దాడిచేసి, హత్యాయత్నానికి పాల్పడిన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ మండలం కాచవాని సింగారానికి చెందిన ఓ మహిళకు ఏదులాబాద్ గ్రామానికి చెందిన శ్రీనివాస్‌తో వివాహమైంది. భార్యకు మరో వ్యక్తితో సంబంధం ఉందని భర్త పలుమార్లు కుల పెద్దల సమక్షంలో పంచాయతీ పెట్టడంతో పెద్దలు ఇరువురికి నచ్చజెప్పారు. కొద్ది రోజులుగా ఆమె పుట్టింట్లో ఉంటోంది. పెద్దలు చెప్పినా ఇరువురిలో ఎలాంటి మార్పు రాకపోవడంతో పాటు వివాహేతర సంబంధానికి కారణమైన జంగయ్య అనే వ్యక్తిపై సదరు మహిళ భర్త కక్ష పెంచుకుని ఎలాగైనా అతడిని హతమార్చాలని పథకం వేశాడు. మంగళవారం మధ్యాహ్నం ద్విచక్రవాహనంపై మేడిపల్లి వైపు వస్తుండగా.. పర్వతాపూర్ సమీపంలోకి రాగానే వెనకాల కారుతో ద్విచక్రవాహనాన్ని శ్రీనివాస్ ఢీ కొట్టాడు. దీంతో జంగయ్య కిందపడటంతోనే కారులోంచి దిగిన అతడు తన వెంట తెచ్చుకున్న ఇనుపరాడ్‌తో దాడి చేశాడు. తీవ్రగాయాలైన జంగయ్య మృతిచెందాడని నిందిడుతు తన కారులో ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. తీవ్రంగా గాయపడిన బాధితుడిని చికిత్స నిమిత్తం స్థానికులు ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ దాడికి సంబంధించి బాధితుల నుంచి ఎలాంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే సమీక్ష

అల్వాల్: నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల కల్పనకు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి జలమండలి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలు మంజూరు చేసేందుకు తాను ముమ్మరంగా కృషి చేస్తానన్నారు. మచ్చబొల్లారం డివిజన్‌లోని శివనగర్, గణేష్‌నగర్‌ల మధ్య నూతన డ్రైనేజీ పైపులైన్లు వెయ్యాలని, కౌకూర్ గృహ కల్పనలో మౌలిక వసతుల కల్పన, తాగునీటి అలోకేషన్, పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. జలమండలి జీఎం సునీల్, డీజీఎం సాంబయ్య, బీఆర్‌ఎస్ నేతలు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

పోచారం: దసరా పండుగను పురస్కరించుకుని మున్సిపల్ కార్మికులకు ఎస్‌వైఆర్ ఫౌండేషన్ సౌజన్యంతో మంగళవారం మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. కార్మికుల సంక్షేమం కోసం ఎస్‌వైఆర్ ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. దసరా పండుగను కార్మికులు ఆనందంగా జరుపుకోవాలన్నారు. ఫౌండేషన్ అధ్యక్షుడు సామల యాదిరెడ్డి మాట్లాడుతూ.. సుమారు 450 మంది కార్మికులకు దుస్తులు పంపిణీ చేశామన్నారు. అనంతరం కార్మికులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి, ఎస్‌వైఆర్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి సామల సందీప్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ మంద సంజీవ్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ మెట్టు బాల్‌రెడ్డి, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారిని ఆరాధిస్తే అన్ని శుభాలే..

రామంతాపూర్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రామంతాపూర్ వెంకట్‌రెడ్డినగర్‌లోని త్రిశక్తి నల్ల పోచమ్మ ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలకు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ సతీమణి జమున, కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

చైన్ స్నాచింగ్

అల్వాల్: రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఓ మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు లాక్కెళ్లిన ఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మచ్చబొల్లారం లక్ష్మమ్మ ఎన్‌క్లేవ్‌లో నివసించే ఉషారాణి (48) మంగళవారం సాయంత్రం రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా.. ఎదురుగా నడుచుకుంటూ వచ్చిన దుండగుడు ఆమె మెడలోని బంగారు గొలుసు లాక్కొని పరారయ్యాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుంతలు.. చింతలు !



అల్వాల్: ఇందిరాగాంధీ విగ్రహం వద్ద, వీబీఆర్ గార్డెన్ నుంచి సిటిజన్ కాలనీ వరకు, అల్వాల్ హిల్స్, పంచశీల హైటెన్షన్ రోడ్డులో గుంతలమయమైన రోడ్డుతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ దారిన వెళ్లే వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని, అనేకసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టి సరిపెట్టుకుంటున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని సమస్యను పరిష్కరించాలని బీజేపీ నేతలు శ్రీనివాస్‌వర్మ, కాలనీవాసులు కోరుతున్నారు. అల్వాల్‌హిల్స్‌లో కనీస రోడ్డు సౌకర్యం, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని కోరారు.



కీసరలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

వాడవాడలా సద్దుల బతుకమ్మ సంబరాలు

మేడ్చల్ జిల్లాలో మంగళవారం సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. పలు గ్రామాలు, కాలనీల్లో మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చి గౌరమ్మను పూజించారు. అనంతరం ఆనందంగా ఆడిపాడారు. బతుకమ్మను నిమజ్జనం చేశారు. – మేడ్చల్ జోన్ బృందం





పూడూర్‌లో..



పోచారంలో..

కనకదుర్గా నమోస్తుతే...

మేడ్చల్ జిల్లాలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా 9వ రోజైన మంగళవారం అమ్మవారిని గడిమైసమ్మ ఆలయంలో దుర్గా దేవి రూపంలో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు శ్రీ కనకదుర్గా దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.
– మేడ్చల్ జోన్ బృందం



దుర్గా దేవిగా గడిమైసమ్మ



కీసరగుట్టలో ..



హరిహర భవాని క్షేత్రంలో..



అవుషాపూర్‌లో హోమం నిర్వహిస్తున్న దృశ్యం



పూడూర్‌లో ..



గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో..